క్లుప్తంగా

సైనికులకు అండగా నిలుద్దాం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించే సైనికులకు అందరం అండగా నిలుద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. తిరంగా యాత్రలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పీబీఆర్ గ్రాండ్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో భారత్ మాతాకి జై నినాదంతో యువకులు, విద్యావంతులు, విద్యార్థులు ఉత్సాహంగా ముందుకు సాగారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి, టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయండి

కదిరి అర్బన్: రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టి ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలని డెమాక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి షర్ఫోద్దీన్, జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజమ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉన్నత పాఠశాలలో తరగతికి 45 మంది విద్యార్థుల కంటే ఎక్కువగా ఉంటే రెండో సెక్షన్ మంజూరు చేయడం ద్వారా విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఉర్దూ పాఠశాలల్లో ఉర్దూ పోస్టులను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

కస్తూర్బా విద్యార్థినికి అంబేడ్కర్ పురస్కారం



ప్రతిభా పురస్కారం అందుకున్న వర్షిక

గాండ్లపెంట: స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థిని జి.వర్షిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పురస్కారం అందుకుంది. వర్షిక ఇటీవల 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 573 మార్కులు సాధించింది. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘం నేతలు ఆదివారం అనంతపురం ఎన్‌జీఓ హోంలో విద్యార్థినికి రూ.1,116 నగదు, ప్రశంసాపత్రం అందించినట్లు ఆమె సంరక్షకుడు తూపల్లికి చెందిన జంపాల వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి టి. రాజారమేష్, జె.శాంతిముని, ఎం లక్ష్మీనారాయణ, మనోహర్, ప్రకాష్, కేశవయ్య, ఆంజనేయులు, స్వరూప్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యల్లమ్మ తల్లి సాక మహోత్సవం



యల్లమ్మతల్లి, యర్రగుంటప్ప స్వాములను ఊరేగిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని ఆత్మకూరు గ్రామంలో గ్రామస్తులు ఆదివారం చంద్రగుత్తి యల్లమ్మ తల్లి సాక మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరుపు కున్నారు. గ్రామానికి చెందిన ఆకులేటి, తాళ్ల, బ్యాళ్ల వారు అమ్మవారి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెండి ఆభరణాలతో అందంగా అలంకరించిన అమ్మవారితో పాటు కోడేకండ్ల పెద్దయ్యస్వామి, పూలఓబయ్యపల్లి తాటిచెర్లప్పస్వామి, ఆత్మకూరు యర్రగుంటప్పస్వామి, బండ్లపల్లి తాడిపత్రప్పస్వామి విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఉదయం 8.30 నుంచి ఉదయం 9.30 గంటల మధ్యలో అమ్మవారి పూజలను నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

రామగిరి: మండలంలోని పేరూరు డ్యాంలో ఆదివారం 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల అనంతరం విద్యార్థులంతా ఒక్కచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఉపాధ్యాయులు ఆంజనేయులు, సుబ్బయ్య, విరుపాక్షి, శ్రీనివాసులు, యోగేశ్వర్ నాయుడు, రమేష్, శ్రీదేవి, నాగరాజు తదితర గురువులను శాలువాలతో సన్మానించారు.

కొత్త రేషన్‌కార్డు కష్టసాధ్యమే!



నల్లమాడ గ్రామ సచివాలయంలో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన పేదలు

- మ్యారేజ్ సర్టిఫికెట్ ఉంటేనే రేషన్‌కార్డు
- షరతు విధించిన కూటమి ప్రభుత్వం
- కొత్త నిబంధనపై లబ్ధిదారుల మండిపాటు

నల్లమాడ: అధికారంలోకి వచ్చిన దాదాపు ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు లేని పేదలకు నూతనంగా రేషన్‌కార్డులు మంజూరు చేయాలని నిర్ణయించి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. ఏళ్ల తరబడిగా రేషన్‌కార్డు లేక ఇబ్బందులు పడుతున్న చాలామంది పేదలు ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇక తమకు రేషన్‌కార్డు వచ్చేసినట్లే అని సంబరపడిపోయారు. అయితే రేషన్‌కార్డు మంజూరు కావాలంటే దరఖాస్తుతో పాటు మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలని ప్రభుత్వం మెలిక పెట్టడంతో పేదల ఆశలు అడియాసలయ్యాయి. కొత్త రేషన్‌కార్డుల కోసం మండలవ్యాప్తంగా దాదాపు 500 మంది దాకా దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక కార్డుల్లో మార్పులు, చేర్పులు, రేషన్ కార్డుల బదిలీకి భారీగా దరఖాస్తులు అందినట్లు సమాచారం.

తప్పని వ్యయప్రయాసలు

మ్యారేజ్ సర్టిఫికెట్ పొందాలంటే తీవ్ర వ్యయప్రయాసలు తప్పేలా లేవు. కొత్తగా పెళ్లయిన జంటకు అయితే రెండు నెలలలోపు ఎక్కడ వివాహం జరిగి ఉంటే ఆ ప్రదేశానికి సంబంధించిన గ్రామ, వార్డు సచివాలయంలో పెళ్లి కార్డు, ఫొటోలు సమర్పించి దరఖాస్తు చేసుకుంటే అధికారులు మ్యారేజ్ సర్టిఫికెట్ మంజూరు చేస్తారు. వివాహం జరిగి రెండు నెలలు దాటితే సమీపంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి లగ్నపత్రిక, పెళ్లినాటి ఫొటోలతో పాటు నోటరీ (లాయర్ అఫిడవిట్) సమర్పించి మ్యారేజ్ సర్టిఫికెట్ పొందవచ్చని సమాచారం. ఇందుకోసం పేదలు తీవ్ర వ్యయప్రయాసలకు గురికాక తప్పదు. అలాకాకుండా తగిన ఆధారాలు సమర్పిస్తే విచారించి గ్రామ, వార్డు సచివాయాల్లోనే మ్యారేజ్ సర్టిఫికెట్ మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రేషన్‌కార్డు మంజూరుకు మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలన్న నిబంధన తొలగించాలని కోరుతున్నారు.

కోత విధించడానికే కొర్రీలు..

రేషన్‌కార్డుల మంజూరును అట్టహాసంగా చేపట్టిన ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు ఇవ్వకుండా లబ్ధిదారులను వీలైనంత మేరకు తగ్గించి తూతూ మంత్రంగా కార్యక్రమాన్ని ముగించాలన్న కుట్రతోనే లేనిపోని షరతులు విధిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. తమకు వివాహం జరిగి దాదాపు పదేళ్లవుతోందని, ఇద్దరు, ముగ్గురు పిల్లలు సంతానం ఉన్నారని, ఇప్పుడు మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలని అడగటం ఎంతవరకు సబబు అని పలు జంటలు ప్రశ్నిస్తున్నాయి. ప్రతి ఒక్కరికీ ఆధార్ తప్పనిసరి అని తెలుసు. మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి అని తెలియదు. మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకోవాలని ప్రభుత్వంగాని, అధికారులుగానీ ఎప్పుడైనా చెప్పారా? మ్యారేజ్ సర్టిఫికెట్‌పై ప్రజలకు కనీస అవగాహన కల్పించారా? అంటే అదీ లేదు. ఉన్నఫళంగా మ్యారేజ్ సర్టిఫికెట్ అడిగితే ఎక్కడనుంచి తేవాలి, ఎలా తేవాలి అంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

99 శాతం మందికి మ్యారేజ్ సర్టిఫికెట్ లేదు..

గత ఐదు, 10 సంవత్సరాల నుంచి పెళ్లయిన వారిలో నూటికి 99 శాతం మందికి మ్యారేజ్ సర్టిఫికెట్ లేదు. వీరిలో పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నవారు, ప్రేమించుకొని పెద్దలకు తెలియకుండా పారిపోయి పెళ్లి చేసుకొని ఇప్పటివరకు రేషన్ పొందని వారు ప్రతి గ్రామంలోను ఐదు నుంచి 10 జంటల వరకు ఉన్నట్లు తెలుస్తోంది. నల్లమాడ మండలం చెరువువాండ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో 260 కుటుంబాలున్నాయి. ఈ రెండు గ్రామాల్లోనే వివాహం జరిగి ఐదేళ్లపైబడి ఇద్దరు, ముగ్గురు పిల్లలు సంతానం కలిగి ఉన్నా ఇప్పటివరకు రేషన్ కార్డు లేని జంటలు 15 ఉన్నాయి. ఈ లెక్కన ప్రతి మండలంలోను రేషన్‌కార్డు లేని పేదలు వేల సంఖ్యలోనే ఉన్నట్లు అంచనా.

మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలన్నారు



నాకు నా భర్త రఘుకు వివాహం జరిగి ఆరేళ్లవుతోంది. ఐదేళ్ల కుమారుడు, మూడేళ్ల వయస్సున్న కుమార్తె సంతానం ఉన్నారు. ఇంతవరకు మాకు బియ్యం కార్డు లేదు. మ్యారేజ్ సర్టిఫికెట్ ఉంటేనే రేషన్‌కార్డుకు దరఖాస్తు చేస్తామని అధికారులు చెబుతున్నారు. దిక్కుతోచక వెనక్కి వచ్చేశాం. మ్యారేజ్ సర్టిఫికెట్ ఎవరిస్తారో, ఎక్కడికెళ్లాలో కూడా మాకు తెలియదు. –జి. దివ్య, గృహిణి, చెరువువాండ్లపల్లి, నల్లమాడ మండలం

నిబంధన తొలగించాలి



నాకు ఆరేళ్ల క్రితం పెళ్లయింది. మాకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె సంతానం ఉన్నారు. ఇప్పటివరకు రేషన్‌కార్డు లేదు. మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలంటున్నారు. నూటికి తొంభై శాతం మందికి మ్యారేజ్ సర్టిఫికెట్లు లేవు. అలాంటి వారు వేల సంఖ్యలో ఉన్నారు. మ్యారేజ్ సర్టిఫికెట్ నిబంధనను ప్రభుత్వం తొలగించాలి. లేదంటే బియ్యం కార్డులు ఇవ్వలేమని అయినా చెప్పాలి. –కాల్వపల్లి వెంకటప్ప, నల్లమాడ

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు



పుట్టపర్తిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎయిడ్స్ కంట్రోల్ అధికారి తిప్పయ్య



కొవ్వొత్తుల ర్యాలీని ప్రారంభిస్తున్న వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్

ధర్మవరం: హెచ్ఐవీ సోకిన వారి పట్ల వివక్ష చూపరాదని యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, షీలా నాగేంద్ర, జయరాం, మోహన్, సికిందర్, లోకేష్ పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం రాత్రి అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ దినోత్సవం సందర్భంగా యువర్స్ ఫౌండేషన్ సభ్యులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ హెచ్ఐవీ సోకి మరణించిన వారిని స్మరించుకుని వారి ఆత్మకు శాంతి చేకూరాలని క్యాండిల్ లైట్ డేను నిర్వహించామని తెలిపారు. వైద్యులు చంద్రిక, శక్తిమైత్రి మహిళా సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణమ్మ, యువర్స్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, మెడికల్ ఆఫీసర్ చంద్రిక, ఎస్ఐ కేతన్న సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం రాత్రి అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్‌తో చనిపోయిన వారికి సంఘీభావంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వ్యక్తులను వివక్షకు గురిచేయరాదని తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారు దృఢంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ వనమాల, ల్యాబ్ టెక్నీషియన్ భార్గవి, టీబీ యూనిట్ బాషా, శక్తిమైత్రి మహిళా సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణమ్మ, వైద్య సిబ్బంది, యువర్స్ ఫౌండేషన్ సభ్యుడు పోలా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం రాత్రి అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా రాత్రి కదిరి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి టవర్‌క్లాక్ వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియజేశారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు. టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, అరుణ, శివజ్యోతి, మల్లికార్జున, శ్రీనివాసులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే ఎయిడ్స్ నివారణ

పుట్టపర్తి టౌన్: ప్రజా చైతన్యంతోనే ఎయిడ్స్‌ను నివారించవచ్చని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ తిప్పయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో వైద్యసిబ్బంది మున్సిపల్ కార్యాయలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్‌తిప్పయ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌తో సోకి చనిపోయిన వారిని మనం గుర్తు చేసుకొంటూ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్స్ మెమోరియల్ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. వ్యాధి సోకిన వారి పట్ల వివక్ష చూపకుండా వారికి మనోధైర్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, వైద్యులు జ్యోత్స్న, మునిచంద్రిక, సీహెచ్ఓ నగేష్‌తోపాటు స్వచ్ఛంద సేవాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

పట్టు తప్పితే బురదలో పడాల్సిందే..



బసినేపల్లిలో నీరు నిలిచి మడుగును తలపిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసినేపల్లిలో ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామస్తులు వివిధ రకాల పనుల నిమిత్తం ఈ మార్గంలో ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, అనంతపురం, ఎన్ఎస్ గేట్ తదితర గ్రామాలకు వెళ్తుంటారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్లేటప్పుడు ఏమాత్రం పట్టుతప్పినా ప్రమాదాలకు గురికాక తప్పదు. ఇందులో ద్విచక్ర వాహనాలు వెళ్తే సగం వరకూ మునిగి పోతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి నీరు ఎక్కువగా నిలిచి రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. నిత్యం ఈ దారిలో ప్రజా ప్రతినిధులు, సచివాలయం సిబ్బంది ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే సమస్యను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని ఇక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన



పూజలందుకున్న పూరి జగన్నాథ బలదేవ సుభద్ర



బృందావన నాటకంలో చిన్నారుల ప్రదర్శన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఇస్కాన్ మందిరంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆదివారం చిన్నారులు దశావతారం, బృందావన కృష్ణుడి నాటకం, భగవద్గీత శ్లోకాలు, హరినామ సంకీర్తనలతో ఆకట్టుకున్నారు. పూరి జగన్నాథ బలదేవ సుభద్రలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సనాతన ధర్మ ప్రచారకులు ఇస్కాన్ టీఎంసీ సభ్యుడు కృష్ణమాధవ్‌దాస్, ఇస్కాన్ మందిరం స్థల దాత నల్లపేట శంకరయ్య, రిటైర్డ్ తహసీల్దార్ రామాంజనేయులు విద్యార్థుల ప్రదర్శనను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



బోనాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు



ఉట్టిని అందుకునేందుకు పోటీ పడుతున్న యువకులు

గాండ్లపెంట: స్థానిక గంగాభవానీమాత తిరునాలో భాగంగా ఆదివారం జ్యోతుల ఉత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. తెల్లవారు జామున మునగలవారిపల్లి, ఎలుగూటివారిపల్లి, గాండ్లపెంట గ్రామాల నుంచి తెల్లవారుజామునే మహిళలు బోనాలు, జ్యోతులతో పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈసందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. సాయంత్రం ఆలయ సమీపంలో ఇనుప స్తంభం ఏర్పాటు చేసి పై భాగంలో ఉట్టిని కట్టారు. యువకులు బృందంగా ఏర్పడి ఉట్టిని అందుకునేందుకు పోటీలు పడ్డారు. చివరకు నాయనివారిపల్లి మహేష్ బృందం ఉట్టిని అందుకుంది. ఉట్టి తరునాలతో మూడు రోజుల పాటు సాగిన గంగాభవాని తిరునాల ముగిసింది.

ఉచిత సామూహిక వివాహాలు



వివాహం అనంతరం జంటలతో పూజలు చేయిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి సమీపంలో ఉన్న సద్గురు యోగి నారాయణ మఠంలో ఆదివారం ఉచిత సామూహిక వివాహాలు జరిపించారు. దాతల సహకారంతో ఎనిమిది జంటలకు వివాహం చేశారు. వధూవరులకు తలంబ్రాల బట్టలతో పాటు తాళిబొట్టును ఉచితంగా అందజేశారు. అనంతరం వధూవరులు, వారి కుటుంబ సభ్యులకు సద్గురు యోగి నారాయణ మఠం వారు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలి



పేరూరులో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రామగిరి: బడుగు, బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేస్తున్న ఆర్డీటీ సేవలను కొనసాగించాలని దళిత సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం పేరూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను వెంటనే రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, బత్తలపల్లి, కళ్యాణదుర్గంతో పాటు చాలా గ్రామాల్లో ఆర్డీటీ పేద ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. విద్యార్థులకు చదువు చెప్పిస్తూ, నిరుపేదలకు ఇళ్లను నిర్మిస్తూ సేవ చేస్తోందని గుర్తు చేశారు. అలాంటి ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు.

వివాహ వేడుకకు హాజరైన వైఎస్ విజయమ్మ



నూతన వధూవరులతో వైఎస్ విజయమ్మ

తాడిమర్రి: అనంతపురంలోని కమ్మ భవన్‌లో ఆదివారం జరిగిన ఓ వివాహ వేడుకలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సతీమణి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ హాజరయ్యారు. తాడిమర్రి మండలం కేఎన్ పాళ్యం గ్రామానికి చెందిన మురుసు వెంకటరమణ (పాళ్యం రమణ) తన చిన్న కుమారుడు యతీంద్ర వివాహం కమ్మ భవన్‌లో జరిపించారు. వైఎస్ విజయమ్మతో పాటు రాజశేఖర్‌రెడ్డి అన్న వైఎస్ జార్జిరెడ్డి సతీమణి భారతమ్మ వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, కానుకలు అందించారు.

ఉత్సాహంగా ఎడ్లబండ్ల పరుగు పోటీలు

ముదిగుబ్బ: మండలంలోని నాగారెడ్డిపల్లిలో గ్రామ ఉత్సవాల సందర్భంగా ఎడ్లబండ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో నిడిమామిడి గ్రామానికి చెందిన సురేష్ ఎద్దులు ప్రథమ, లింగప్పగారిపల్లికి చెందిన రాజా నాయుడు ఎద్దుల ద్వితీయ, అదే గ్రామానికి చెందిన రెడ్డప్పగారి చలపతి ఎద్దులు తృతీయ, బ్రాహ్మణపల్లికి చెందిన ఎర్రబల్లి సూరి ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచాయి. ఎద్దుల యజమానులకు ఆదివారం ఎంపీపీ ఆదినారాయణ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంజునాథ్, మాజీ సర్పంచ్ వెంకటరమణ, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ వెల్ఫేర్ పాలసీ బాండ్ల పంపిణీ



బాండ్లను అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి యూనియన్ నేతలకు వెల్ఫేర్ పాలసీ బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ నాయకుల సంక్షేమం, ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని యూటీఎఫ్ వెల్ఫేర్ పాలసీని రాష్ట్ర, జిల్లా నాయకులకు అందిస్తున్నామని తెలిపారు. యూటీఎఫ్ నాయకులకు ఎవరికైనా అనారోగ్య రీత్యా శస్త్ర చికిత్సలు అవసరమైతే రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు తక్షణ సాయం అందించడమే ఈ పాలసీ లక్ష్యమన్నారు. ప్రస్తుతం రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి, పూర్వపు రాష్ట్ర, జిల్లా నాయకులకు బాండ్లను అందిస్తున్నామని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మేరీ వరకుమారి, జిల్లా కార్యదర్శులు లతాదేవి, రామకృష్ణనాయక్, ధర్మవరం జోన్ నాయకులు ఆంజనేయులు, లక్ష్మయ్య, సకల చంద్రశేఖర్, పెద్దకోట్ల సురేష్, రాంప్రసాద్, సాయిగణేష్, రామంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

తనకల్లు: రానున్న ఐదు రోజుల్లో భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శోభా సువర్ణమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా గ్రామాల్లోఎక్కడైనా ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరిగిన వెంటనే కంట్రోల్ రూం సెల్ నెంబర్లు 7989194386, 7799892099, 9492548697, 7569946740లకు సమాచారం అందించాలని సూచించారు.

విద్యుత్ కోతలపై సీపీఐ ధర్నా

ముదిగుబ్బ: మండలవ్యాప్తంగా ఇటీవల ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నారని సీపీఐ నాయకులు మండిపడ్డారు. ఆదివారం రాత్రి సీపీఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాతూరు, గుడ్డంపల్లి తండా వాసులతో కలిసి స్థానిక విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. కొన్ని వారాల నుంచి మండలవ్యాప్తంగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా తయారైందని సీపీఐ నేత చల్లా శ్రీనివాసులు మండిపడ్డారు. రేపటిలోగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోతే విద్యుత్‌కార్యాలయంతోపాటు జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు.